# జీవితమును వజ్రతుల్యము చేసుకొనుట ఎట్లు?



ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము
చిన్నకోటవారి వీధి, విజయవాడ - 520 001.
అంతర్జాతీయ ముఖ్యకేంద్రము: ఆబూ పర్వతము, రాజస్థాన్

# జీవితమును వజ్రతుల్యముగా ఎలా చేసుకోవాలి?

పరమపిత శివ పరమాత్మ

SUPREME FATHER GOD SHIVA

-: ప్రకాశకులు :-

**ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము**

విశ్వకళ్యాణకారి భవనము

H.No. 11-8-1, సుబ్బరామయ్య స్కూల్ దగర

విజయవాడ - 520 001, ఫోన్. 0866- 2564338

అంతర్జాతీయ ముఖ్య కేంద్రము : ఆబూ పర్వతము, రాజస్థాన్

# జీవితమును వజ్రతుల్యముగా ఎలా చేసుకోవాలి?

పదిహేడవ ముద్రణ
ఫిబ్రవరి-2013

ప్రతులు : 5000

ముఖపత్ర రచన :
**కాశీ**

డి.టి.పి :
**కీర్తన గ్రాఫిక్స్,**
విజయవాడ-3.

ముద్రణ :
**స్వామి ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**
గాంధీనగర్,
విజయవాడ-3.

# ముందుమాట

ఈనాడు మానవుడు ఆధునిక విజ్ఞానముచే ఎంతో ప్రగతి సాధించుటయే గాక చంద్రమండలాన్ని దాటి అంగారక గ్రహం అంచులు తాకుచున్నాడు. కానీ ఎంతగా భౌతిక ప్రగతి సాధించాడో అంతగా నానాటికీ సద్గుణాలు కోల్పోయి ఆధ్యాత్మిక విలువలు లేక అధోగతి పాలగుచున్నాడు. నేటి మానవుని దైనందిన జీవితము అన్ని విధాలుగా దుర్భరమైపోయినది. ధర్మం నాలుగు పాదాలుగా నిలిచి సుఖ - శాంతి - పవిత్రతలు విరాజిల్లిన కృతయుగ (సత్య) త్రేతాయుగము లెక్కడ? అడుగడుగునా బాధల గాధలువినబడే నికృష్టమైన ఈ కలియుగ మెక్కడ? కొన్నాళ్ళకు పూర్వం పరిస్థితులింత అధ్వాన్నంగా లేవు. రోజురోజుకూ మానవుని జీవితం చిల్లిగవ్వకు కొఱగాకుండా సారవిహీనమై పోయినది. పరస్పర ఆదరాభిమానాలుగానీ, యదార్థమైన సుఖ శాంతులుగానీ మచ్చుకు గూడ కానరా కుండా పోయాయి.

రాజకీయ - ఆర్థిక - సామాజిక పరములైన చిక్కు సమస్యలలో మునిగి తేలుతూ నిరాశా నిస్పృహలతో కృంగి కృశించి పోవుచున్నది. నేటి మానవులు "షుమారు రెండువేల సంవత్సరములనుండి అనేక సాధు సన్యాసులు, మహాత్ములు దేశ సంక్షేమం కోరి చేసిన జప - తపాది తీవ్ర ప్రయత్నములన్నీ మానవుని పతనానికే దారి తీసినవా? ఈ ప్రపంచమును ఇవుడిక మార్చుట ఎవరి తరము కాదేమో? చివరకు మానవుని స్థితుగతులేమి కానున్నాయి?" అని కొందరు వాపోతుండగా మరికొందరు "ఒకవేళ పరమాత్ముడుంటే ఆయన ఈ ప్రపంచమును ఎందుకు మార్చరాదు? అవతరించే వాడైతే ఎందులకు అవతరించి మానవులకు సదాచార- సత్ప్రవర్తనలను నేర్పడు? దుఃఖహర్త సుఖకర్త గదా! దుఃఖము తొలగించి సుఖానందము లేల ప్రసాదించడు" అని మరికొందరి ప్రశ్న.

ఇచట మేము స్పష్టీకరించదలచినదేమంటే ఎంతటి గొప్ప పేరు ప్రతిష్టలు తెలివితేటలు గల మానవులకైనను సుఖశాంతి పవిత్రతలను ఈ పుడమిపై పునఃనెలకొల్పగల సామర్థ్యం వుండజాలదు. ఈ పవిత్ర కార్యమును కేవలం జ్ఞానసాగరుడు, ప్రేమసాగరుడు, దయాంబుధి, సర్వ శక్తివంతుడు, సాగరుడునగు పతితపావనుడైన పరమపిత పరమాత్మయే చేయగలడు. సర్వాత్మలకు మేలు కలిగించువాడు. కావున అతనినే

కళ్యాణకారుడు లేక "శివుడు" అంటారు. కలియుగాంతమున పూర్తి ధర్మగ్లాని సంభవించినపుడు కల్పమున కొక్కమారు మాత్రమే పరమాత్మ శివుడు అవతరించి సంపూర్ణ సుఖశాంతి సంపన్నమైన సత్యయుగ దేవీదేవతా సామ్రాజ్య స్థాపన గావించును. ఈశ్వరుడే స్వయముగా బోధించుచున్న సత్యగీతాజ్ఞాన, సహజ రాజయోగాభ్యాసముచే గుడ్డిగవ్వకు కొఱగాకుండా పోయిన మానవ జీవితం వజ్రసమంగా మారి వైకుంఠ వారసత్వాధికారం సంక్రమించును.

ఇప్పుడు పరమాత్మ కల్పపూర్వమువలె తన సృష్టి స్థాపనా కార్యమును నిర్వర్తించుచున్నాడు. ఇది సమస్త మానవాత్మలకు దివ్యమైన శుభవార్త. ఇపుడది త్వరలోనే 100% సుఖశాంతులతో తులతూగే కాలము రానున్నది. ఇది నిజమా? సంభవమా? నిజంగా పరమాత్మ అవతరించాడా? అని పఠితలు ఆశ్చర్యపడవచ్చు కాని కొంత ఆలోచించి చూచిన ఈనాటి విపరీత పరిస్థితులే భగవంతుడు అవతరించి జగదోద్ధరణ గావించుననుటకు ప్రత్యక్ష నిదర్శనములు.

నేడు ప్రపంచ వినాశనంకోసం ఉదజని బాంబులు, హైడ్రోజన్, నైట్రోజన్ బాంబులు తయారై యున్నవి. అత్యాచారాలు, దౌర్జన్యాలు, పాపాచరణ విజృంభించి సర్వత్ర వ్యాపించాయి. ప్రజలు అడుగడుగునా క్లిష్ట సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటువంటి నికృష్టమయిన దుర్భర జీవితములతో వేగిపోవుచున్న ప్రపంచమును కరుణాసింధువగు పరమాత్మ తప్ప ఎవరూ బాగుపరచలేరు. ఇపుడు ప్రజాపిత బ్రహ్మ ద్వారా స్వయం పరమాత్మయే శాంతి - సుఖాలను ఈశ్వరీయ జన్మ సిద్ధాధికారంగా ఎల్లరికి ప్రసాదించుచున్నాడు.

దేనికి కొరగానీ మానవ జీవితమును వజ్రతుల్యముగా మార్చు టకు. సృష్టిని సత్యయుగముగా మలచుటకు కళ్యాణకారి పరమ శివుడు అతి ముఖ్యమైన 4 సులభోపాయములను బోధించినాడు. వాటి నుండి 9 ముఖ్యో పాయములను నిత్య జీవితములో అభ్యసించి సహజంగా అలౌకిక జీవితము నారంభించుట కొఱకే ఈ చిన్న పొత్తము మీ చేతినలంకరించినది.

ఇట్లు
ఈశ్వరీయ సేవలో
బ్రహ్మాకుమారీ-కుమారులు

# జీవితమును వజ్రతుల్యముగా ఎలా చేసుకోవాలి?

## ఈశ్వరీయ జ్ఞానము - మరియు నిశ్చయము

ఈనాటి మనవుని అనేకములైన మానసిక సంఘర్షణలకు అశాంతి-దుఃఖములకు హేతువు తన్ను తాను మరచిపోవుటయే. ఇంతే గాకుండా పరమపిత పరమాత్మ గురించి తనకు గల పరస్పర సంబంధము గురించి కూడ గుర్తించలేక పోవుచున్నాడు.

మనిషి తన దేహమును, దేహమిచ్చిన తండ్రిని, దేహ సంబంధీకులను మరచిపోడు. కానీ ఈ దేహమునకు భిన్నమై ఈ దేహములోనే నిక్షిప్తమైన చైతన్య శక్తియగు ఆత్మను మరచిపోయాడు. ఆత్మ పరమపిత పరమాత్మ సంతానము. నేటి మానవులకు తాను సుఖశాంతి ప్రదాతయగు పరమాత్ముని బిడ్డననిగానీ, ఎచటనుండి వచ్చాడో, ఎచటకు పోవలసియున్నదో, ఈ జగన్నాటక విశేషమేదో, జీవన లక్ష్యమేదో తెలియనందువలన అధఃపతనమైపోయాడు.

నేటి మానవునకుగానీ, ప్రపంచమునకుగానీ, మేలు జరగాలంటే ఆధ్యాత్మిక ప్రగతిపథంలో పయనించాలనుకొంటే మొదట తానొక ఆత్మననీ, పరమ ప్రియుడైన పరమాత్మ సంతానమని గ్రహించాలి. జీవన లక్ష్యమును మరియు కర్మల గుహ్యగతి-ఫలములను గుర్తించి వ్యవహరించాలి తాను గ్రహించిన జ్ఞానమును నిత్యజీవితములో ఆచరణాత్మకముగా పాటించాలి. అపుడే జీవితములో నిజమైన పరివర్తన కలిగి సుఖ శాంతులను భవించగలరు. ఈశ్వరీయ జన్మ సిద్ధాధికారముగా సంక్రమించిన ఆయురారోగ్య ఐశర్యములనపుడే అందుకొనే యోగ్యత సంపాదించగలరు.

ఉదాహరణకు ఒక తండ్రి తన చిన్న కుమారునితో నేను నీ

తండ్రిని. ఆమె మీ అమ్మ. ఈయన నీ సోదరుడు. నా పేరు ఫలనా.... మన దేశం ఫలాన .... అని చెప్పిన దాని నాతడు పరిచయ మాత్రంగా కాకుండా వ్యవహారములో కూడా ఆ సంబంధానుగుణ్యముగా నిజ జీవితంలో ప్రవర్తించుటచేత అతనికి తండ్రి నుండి జన్మ సిద్ధాధికారముగా పిత్రార్జితమగు సంపద లభిస్తుంది. అలాగే పరమపిత పరమాత్మ కూడా తన దివ్యధామము, సర్వాత్మలతో తనకు గల అవినాశి సంబంధ పరిచయమిస్తాడు. ఆ జ్ఞానము కేవలము బుద్ధి ద్వారా తెలిసి కొనుటయే ప్రధానము కాదు. దానిని మన నిజజీవితములో జోడించి అతనితో సత్యమైన ప్రేమ, యదార్థ స్నేహ బంధమును కలిగియుండవలెను. అపుడే మనము పరమపిత యగు సర్వేశ్వరుని నుండి సంపూర్ణ పవిత్రత, సుఖ-శాంతులు, ఈశ్వరీయ జన్మ సిద్ధాధికారముగా పొందగలము.

## ఈశ్వరీయ జ్ఞాన నిశ్చయము

ఈశ్వరీయ జ్ఞానమును నిత్యజీవితములో ఆచరించాలంటే ముందు ఆ జ్ఞానమునందు పూర్తి విశ్వాసమేర్పడాలి. అపుడే ప్రతి పనిలో కూడా ఒక గొప్ప విశిష్టత ఏర్పడుతుంది. నిశ్చయంతో పనులు చేయుటచేత అతని కృత్యములలో ఒక ధృఢత్వము, కార్యదీక్ష, నేర్పరితనము చోటు చేసికొంటాయి.

ఉదా॥ ఒక వ్యక్తి ఇంటిలో తండ్రిగా, పాఠశాలలో ఉపాధ్యాయునిగా, మిత్రులతో స్నేహితుడుగా నిశ్చయాను సారముగనే ప్రవర్తించగలడు.

అలాగే మానవుని నిశ్చయమే అతని కర్మలకు నేతృత్వము. తన నిశ్చయానుసారముగనే పనులు జరుగుతుంటాయి.

ఇపుడు ప్రజాపిత బ్రహ్మ ద్వారా స్వయంగా పరమపిత పరమాత్మ ప్రబోధించుచున్న ఈ సత్యగీతాజ్ఞానముపై విశ్వాస మున్నపుడే జీవితములో అత్యున్నతస్థాయి నందుకొనగలరు. నిశ్చయబుద్ధి ఏర్పడనంతవరకు పురుషార్థం ప్రారంభమైనట్లే కాదు.

జ్ఞాన విశ్వాసమాధారంతోనే సఫలత సంప్రాప్తిస్తుంది.

నిశ్చయాత్మా విజయంతీ సంశయాత్మా వినశ్యంతీ అంటారు.

## నిజ జీవితంలో నిశ్చయబుద్ధిచే జ్ఞానాచరణ

ప్రతిరోజు మనం తిరుగుతూ, తింటూ ప్రతి పని చేస్తూ "నేను ఆత్మను. నేను కళ్యాణకారి, సుఖశాంతి ప్రదాత, త్రిలోక నాథుడు, సర్వ శక్తివంతుడైన జ్యోతిర్బిందు స్వరూపడగు పరమపిత పరమాత్ముని జ్యోతిర్బిందు స్వరూపుడనగు సంతానమును. నేను ఈ శరీరమును కాను. ఈ శరీరము నా రథము. ఇందులో కూర్చొని నడిపే సారథిని. బ్రహ్మలోకమున నివసించే జ్యోతిర్బిందు స్వరూపమగు అవినాశి ఆత్మను. మొదట నేను పవిత్రునిగా, శాంతిమయునిగా, నిర్వికారిగా ఉన్నాను. ఈ సృష్టియనే కర్మక్షేత్రముపై అనాదిగా నిర్ణీతమై యున్న పాత్రానుసారము అభినయించుటకు వచ్చాను. చివరకు ఇపుడు నేను నా స్వస్థానమైన శాంతిధామమునకు వెళ్ళవలసి యున్నది. కావున ఈ పాంచభౌతికమైన వ్యక్తి వైభవాలతో అంటీ-అంటనట్లుగా అనాసక్తుడనై వుండాలి: వీటితో నాకు గల సంబంధము క్షణిక మాత్రమైనది. ఈ శరీరమనే తొడుగును కూడ ఇచటనే విడచి మరల జ్యోతిర్బిందు రూపంలో తిరిగి తప్పక వెళ్ళవలసి యున్నది". ఇలా భావించాలి ....

నేను జ్యోతిర్బిందు కళ్యాణకారి పరమాత్ముని సంతానమగుటచేత అతని వలె నేను కూడ కళ్యాణకరమైన కర్తవ్యమును నిర్వర్తించవలసియున్నది. నేను ఎవరి గురించి కామ, క్రోధ, లోభ, మోహాహంకారములతో గానీ, ఈర్ష్యాద్వేషములు, నింద, హింసాత్మక భావముతో గానీ కర్మ చేయను. స్వీయ కళ్యాణముతో బాటు జగత్కళ్యాణము చేయుట నా విధి. ఇతరులకు కీడు చేయువారికి కీడు చేకూరును. అందువలన దుర్వ్యసనములను, కామాది విషయ వికారములను వదలి ఇంటిలో వుంటూనే మనసును ఈశ్వరుని యందు నెలకొల్పుదును. అస్థిమాంస పంజరమగు ఈ తుచ్ఛ

శరీరము నందు మనసును తగుల్కొననీయను. ఇపుడు నేను ఈశ్వరుని స్మృతిలో ఏక రసస్థితిలో తన్మయుడనగుదును. నేను జీవితంలో ఎదురయ్యే విపరీత పరిణామముల కతీతముగా శాంతి చిత్తుడనై కార్యవిధి గావింతును. ఎందులకనగా ఇపుడ నా జీవిత మును ఎందుకూ పనికిరాని కలియుగ కాసుల కొఱకు వ్యర్థపరచక వజ్రతుల్యమైన దేవతా జీవితమువలె తయారు చేసికొనవలసి యున్నది.

నేను నా స్వరూపమునందుపస్థితుడనై రానున్న మహా వినాశనము గురించి అప్రమత్తుడనై ఇతరులకు కళ్యాణమును కలిగించే కర్తవ్యాచరణ చేయుదును. యిపుడు పరమపిత పరమాత్మ ప్రబోధించుతున్న ఈశ్వరీయ సత్యగీతాజ్ఞానము మరియు సహజ రాజయోగముల నాచరిస్తూ ఇతరుల శుభ చింతకుడనై సర్వాత్మలకు పవిత్రత - రాజయోగ మార్గముల ననుసరించుటకు ప్రోత్సాహ మిచ్చుదును. కమల పుష్ప సమంగా పవిత్ర జీవితమును గడుపుతూ యోగస్థితుడనై ఇతరులు కూడా యోగస్థితి నందగల ప్రేరణ నిచ్చుదును. ఇపుడు శివపరమాత్మ స్థాపించే సత్వప్రధానమైన దివ్యగుణ సంశోభితమై విరాజిల్లే సత్యయుగస్థాపనలో నేను కూడ తనువు, మనసు, ధనములతో త్రికరణశుద్ధిగా సర్వోత్తమ సేవా సహాయము చేయుదును.

# ప్రథమయుక్తి

## దినచర్యపై శ్రద్ధ

వజ్రతుల్య జీవితమును గడుపుటకు మానవుడు తన మనో వాక్కర్మలపై పూర్తి ధ్యానముంచవలెను. అతడు తన దిన చర్యను జాగ్రత్తగా నిర్వహించుకొంటూ ఆత్మ పరిశీలనతో నుండాలి. ఈనాటి ప్రజల అధోగతికి కారణము దైనందిన జీవితంలో క్రమశిక్షణ లోపించుట, సోమరితనము, నిర్లక్ష్యము, చెడు సంస్కారములు అలవాటయ్యేది కూడా దీని వలనే. కావున ఈ దిగువ ఒక చక్కని దిన చర్యను సూచించుచున్నాము.

## అమృత వేళ లేచుట

పునాది బలంగా వున్నప్పుడే భవంతి దృఢంగా తయారైనట్లు "అమృతవేళ" దినమంతటికి పునాది వంటిది. ఆ సమయమందున్నటు వంటి స్థితిపైన దినమంతటి మానసిక ప్రవృత్తి ఆధారపడియుండును. వాస్తవానికి ఉదయం 3 లేక 4 గం॥లకు లేచుట చాలా మంచిది. అపుడు నలుమూలలా ఏకాంతం, ప్రశాంత వాతావరణం, మలయ మారుత పవనాలు వ్యాపించి యుంటాయి. రోజంతటి కార్య వ్యవహారముల నుండి రాత్రి విశ్రాంతి తదనంతరము మనసు నిర్మలంగా ప్రశాంతంగా వుంటుంది. ఆ సమయంలో ఈశ్వరుని స్మృతి సంలగ్నతలో కూర్చుండుటచే మనసు తేలికగా ప్రభు ప్రేమలో తాదాత్మ్యం పొందగలుగుటయేగాక జీవితంలో అత్యున్నత ప్రాప్తి కూడ లభిస్తుంది. ఉదయం 3 గం॥లకు లేచుటచే ఒకటి రెండు గంటలు నిద్రాత్యాగం చేయవలసి వచ్చిన ప్పటికీ ఆ త్యాగమున కంటే వేలరెట్లు ప్రయోజనము కలుగుతుంది. ఒకవేళ ఎవరైనా ప్రతిరోజు ఆ సమయంలో మేల్కొనలేకపోయిన యెడల కనీసం 4 గం॥ల కైనను తప్పకుండా లేవవలయును. ఇది మొదట కష్టమని పించినను అభ్యాసముచే క్రమక్రమముగా తేలికనిపించును.

2. అమృతవేళ మొదటి సంకల్పము ప్రధమ స్మృతి ఒక చక్కని ప్రయత్న శీలికి కనులు తెరువగానే మనసులో ముందుగా పరమపిత పరమాత్ముని స్మృతియే కలగాలి. అతనికెన్నో వ్యవహార ములున్నప్పటికీ ఉదయం అమృతవేళ లేవగానే ఇతర సంకల్పములేవీ రాకుండా పరమాత్ముని స్మృతి మరియు తానొక ఆత్మననే స్మృతియే సహజ స్వాభావికంగా రావలెను. ఈ చిన్న సంకల్ప ప్రభావము మొత్తము దినచర్యపై పడుతుంది. అతడు తటాలున మంచము నుండి లేచి ఇతర పనులలో నిమగ్నుడు కాకుండా అలాగే 5-10 నిముషములు ఈ విధముగా స్మృతించవలెను. నేను ఒక జ్యోతిర్బిందు ఆత్మను. జ్ఞాన సాగరుడు, శాంతిపయోనిధి, ఆనందాబ్ధి ప్రేమసాగరుడగు పరమపిత పరమాత్మ శివుని సంతానమును అయిన

నేను కూడ సర్వమంగళకరుడు, సుఖశాంతిదాత వలె ఇతరులకు సుఖమిచ్చుటకు, మేలు చేయుటకు నిమిత్తుడనగుదును. పరమశాంతి-పవిత్రత తాండవించే పరంధామము నుండి ఈ సృష్టియనే రంగస్థలముపై పాత్రధారినై వచ్చాను. వాస్తవానికి నేను బ్రహ్మలోక నివాసిని. ఈ భువికేతెంచిన తరువాత సత్య, త్రేతా యుగములలో నా జీవితము పవిత్రముగా దివ్యములైన సంపూర్ణ సుఖశాంతి సంపన్నముగా స్వర్ణ రజిత తుల్యముగా వుండేది. అచట దివ్యమైన రాజ్య భాగ్యముతో సుఖంగా వుండేవాడను. ద్వాపర కలియుగాలలో నేను చాలా భక్తి చేస్తూ కొద్దో గొప్పో సుఖమను భవించాను. ఇపుడు పరమ పావనమైన సంగమయుగాన ఈశ్వరీయ జ్ఞానంతో అలౌకిక జన్మ పొందాను. ఇపుడు నేను పరమపిత శివ పరమాత్మని అమర పుత్రుడనని, జ్యోతిర్బిందు అశరీరి ఆత్మనని, త్వరలోనే నేను పరంధామమునకు తిరిగి వెళ్ళవలసి యున్నదని గ్రహించాను.

ఓహో ఇపుడు నేను పరమపిత పరమాత్మతో సంబంధము జోడించగలిగిన సౌభాగ్యశాలిని. నిరాకార పరమపిత పరమాత్మయే నా పరమపిత-పరమ శిక్షకుడు, పరమ సద్గురువు. ఈ మృత్యు లోకము నుండి తన శాంతిధామం వద్దకు తరువాత వైకుంఠానికి నన్ను గొని పోవుచున్నాడు. ఆహా! ఇపుడు నేను ప్రజాపిత బ్రహ్మ ముఖవంశావళి. సత్య బ్రాహ్మణుడను. పావనపుత్రుడైన బ్రహ్మకుమారుడనయ్యాను. ఈశ్వరీయ జ్ఞాన రాజయోగముల ద్వారా నా జీవితమును కమలపుష్ప సమానంగా పవిత్రంగా చేసి వజ్రతుల్యుడనగుచున్నాను.

ఈ విధంగా కొద్ది సమయం వరకు మధుర జ్ఞాన రహస్య మును మననం కావించి కాలకృత్యములను తీర్చుకొని స్నానమును గావించి విశేషించి ఈశ్వరీయ స్మృతిలో కూర్చొనవలయును. తదనం తరము ఈశ్వరీయ సేవా కేంద్రమునకు వెళ్ళి జ్ఞానమురళి శ్రవణము చేయవలెను. ఇది తమ జీవితానికి అత్యావశ్యకమే కాదు, జ్ఞాన రత్నాల అపూర్వ సంపాదన, జన్మజన్మాంతరముల సుఖ శాంతులకు ఆధారము. దీనినే ఆత్మ స్నానము లేక ఆత్మ భోజనముగా తప్పక భావించవలెను.

## ప్రతిదినము ఈశ్వరీయ విశ్వవిద్యాలయము నందు జ్ఞానయోగాభ్యాసము

జ్ఞాన తరగతి యందు మనసును నిరాకారుడు, జ్యోతి ర్బిందు స్వరూపుడు మరియు పరంధామ నివాసియగు పరమపిత పరమాత్మ శివుని స్మృతియందు జోడించి శాంతి, శక్తి, ప్రకాశము మరియు పవిత్రతాది అనుభవమునందు తన్మయము చెందవలెను. ఆ ఏకైక స్మృతిలో ఎంతో ఆనందమున్నది. ఆత్మకు ఎంతో బలము లభించుటయేగాక రోజంతా ఒక అలౌకికానందోత్సవములు తొణికిసలాడుతుంటాయి. తరువాత క్లాసులో ఈశ్వరీయ జ్ఞానము నెంతో శ్రద్ధగా విని ముఖ్య విషయములను తమ నోట్‌బుక్‌లో వ్రాసికొని మాటిమాటికి వాటిని మననం చేయవలెను. పరమపిత పరమాత్మ శివుని జ్ఞానవాణిలో యివ్వబడిన ఆదేశ నిర్దేశములను నిజజీవితంలో ఆచరించాలనే దృక్పథము కలిగి ప్రవర్తించాలి. మనలోని అవగుణాలనే గులకరాళ్ళను తొలగించి జీవితమును సద్గుణ రత్నాలతో నింపవలెను. కేవలం జ్ఞాన శ్రవణ సమయమందే తనను ఈశ్వరీయ విద్యార్థిగా భావించక తనను పరమాత్మని సంతానముగా, ఈశ్వరీయ విద్య నార్జించే ఆదర్శ విద్యార్థిగా, దేవ పదవిని ప్రాప్తింపజేసికొని శ్రేష్ఠ పురుషార్థిగా భావించుచూ తన జీవితమును సదా అత్యున్నతముగా మలచుకొనుటపై, లోకోద్ధరణపై మనసు నిలుపుచూ యితరుల ముందు ప్రత్యక్షమయ్యే ఆదర్శ మూర్తిగా నడచుటకు సంపూర్ణ ప్రయత్నము చేయవలెను.

## ఏ ఆహారమును ఏ విధంగా భుజింపవలెను

ప్రతి దినము పరమపిత పరమాత్మని జ్ఞాన శ్రవణమును చేసి ఇంటికి వెళ్ళిన తరువాత భోజనాది కార్య వ్యవహారములు

గావించుకొనవలసి యుండును. కానీ భుజించే సమయములో కూడా అతనికి ఈశ్వరీయ నషా (తన్మయత్వము) కలిగి ఈశ్వరుని గుణములను మననం చేస్తూ వుండవలెను. భోజనం సాత్వికంగా శుద్ధిగా వుండాలి. తినేటప్పుడు ఇది ఈశ్వరుని అనుగ్రహముచే లభించిన మహాప్రసాదము. దీనిని నేను స్వీకరిస్తున్నానని భావించుట వలన ఆహారము సత్వ ప్రధానమగుటయే గాక ఈశ్వరీయ సేవలో కర్తవ్యమును చక్కగా నిర్వర్తించగలరు. భోజనముపై ఆసక్తి ఉండ రాదు. భుజించునపుడు అనవసర ప్రసంగం చేయరాదు. ఆత్మ స్వరూపము నందుపస్థితులై ప్రభు ప్రేమ నాస్వాదించుతూ సాక్షి భావంతో భోజనము గావించవలెను.

## కార్య వ్యవహారములు చేస్తూనే మనసును ఏకాగ్రము చేయుట

దైనందిన కార్యక్రమములను నిర్వహించుచునే నిరంత రము ఈ విధముగా భావించవలెను.

నేనిప్పుడు సర్వవిధాలుగా పరమపిత పరమాత్మ వాడనైతిని. ఇదంతయు అతనిదే. నేను కేవలము నిమిత్త మాత్రుడను. కావున నా కెలాంటి అహంకారము ఉండరాదు. నేను కామ క్రోధాది విషయ వికారములకు వశీభూతుడనై అపవిత్ర కార్యములు చేయరాదు. ఎల్లరిపై శుద్ధ ప్రేమతో, శాంతి, పవిత్రతలతో మైత్రీభావముతో వ్యవ హరించవలెను. ఈ సృష్టియనే విరాట్ నాటకంలోని దృశ్యములుగా భావిస్తూ దైనందిన కార్యనిర్వహణ గావించవలెను.

ఉదాహరణకు: ఒక వ్యక్తి నాటకములో రాజు పాత్రా భినయము గావించినను అతని స్మృతిలో నిజానికి నేనురాజును కాను. ఫలాన స్థానంలో నా ఇల్లున్నది. ఫలాన వ్యక్తి కుమారుడను. రాజు వేషంలో కొద్ది సమయం వరకు మాత్రమే నేను పాత్ర నభినయించుచున్నాను అని వుంటుంది. అలాగే ప్రతి జ్ఞానీ ఆత్మ కూడ నేను ఇపుడు వ్యాపారిగానో, ఆఫీసర్‌గానో, మరేదో ఒక కర్తవ్యం

నిర్వర్తించుచున్నప్పటికీ ఇది నా అల్పకాలిక పాత్రయను విషయం మరచిపోరాదు. నేను వాస్తవమునకు వీటన్నింటికీ అతీతుడనైన ఒక జ్యోతి బిందు స్వరూపమగు ఆత్మను, పరంధామ నివాసిని. పరమపిత పరమాత్మ సంతానమును. ఈ మిత్ర, పుత్ర, సంబంధీకులు ఇచ్చి పుచ్చుకునే వారు కూడ నిజానికి ఆత్మలే పాత్రాభినయం గావించు చున్నారు. ఈ విధంగా భావించుటచేత మీస్థితి అవ్యక్తంగాను, అతి ఆకర్షణీయముగాను కాగలదు

## ప్రతి పరిస్థితులలో సంతృప్తి ఉపరామస్థితి

ఈనాటి సాంసారిక జీవితంలో అనేక వికర్మల కలహ క్లేశములు, విఘ్నాలు, అవస్థలు, సుఖదుఃఖాలు మొదలైన పరిస్థితులు ఎదురైనప్పటికీ జ్ఞానీ ఆత్మ సదా సంతృప్తిగా, ఉపరామ వృత్తితో నుండును. ఇదంతా జగన్నాటకములోని చిత్ర విచిత్ర. దృశ్యములుగా భావిస్తూ హర్షశాకాదులకు గురికాకుండా ప్రతి పరిస్థితుల కతీతంగా వుండగలడు.

ఈ విధమైన శక్తి అతనికి ప్రతి పని చేయునపుడు పరమపిత పరమాత్మ స్మృతి చేతనే సంక్రమించగలదు. పనిచేయు సమయంలో మనసు భగవంతునిపై నిలవదనుకొనుట పొరబాటు. మనము పరమపిత పరమాత్మ సంతానము. చివరకు మనము వెళ్ళేది గూడ అతని వద్దకే. మన పుణ్యపాప ఖాతాలను సమర్పించుకొనవలసినది కూడ అతనికే. అటువంటి శివపరమాత్మ స్మృతి ఎందుకు చేయ రాదు? అతని స్మృతిలోనే సదా శుభమున్నది. అతనిపట్ల మనకు ఎంతో అత్యంత స్నేహానురాగములుండాలి. ఆయనయే మనలను మృత్యుపంజరము నుండి విడిపించేవాడు. ఆయనయే సదా సుఖ శాంతులు ప్రసాదించేవాడు. ముక్తిధామం, జీవన్ముక్తి ధామములకు తీసికొని వెళ్ళే పరమసద్గురువు. వాస్తవానికి భగవంతుని స్మృతి లేకుండుటకు కారణం నేనే ఫలానపని చేస్తున్నాను. నాపైననే బాధ్యత ఉన్నది. వీరు నా సంబంధీకులు అనుకొనుటయే. కావున

నేను నిమిత్తుడను, ట్రస్టీని, నా సర్వ సంబంధాలు ఈశ్వరుని తోడే. మిగతా అందరితోబాటు నా పూర్వజన్మ ఋణానుబంధమును తీర్చు కొంటున్నాను అని ఈ విధంగా నిరంతరం భావించినచో పరమాత్మని మరచిపోలేరు.

ఇది చాలా కష్టమైన పని, ఇది అసంభవము, అసాధ్యము అనే భావనలు రానీయక పావనప్రదమైన ఈశ్వరుని స్మృతియనే పురుషార్థం పరిపక్వమయ్యేంతవరకు విడిచిపెట్టరాదు. ఆత్మిక స్మృతి యందుండే లక్ష్యమును మరచినప్పటికీ, పరమాత్మని స్మృతి నిలువకున్నప్పటికీ, పురుషార్థమును విడిచిపెట్టరాదు. నిరాశ నిస్పృహ చెందకుండా ఇలా భావించాలి. నాలో పూర్వపు అజ్ఞాన సంస్కా రములు బాగా వేర్లు పాతుకొనిపోయి దృఢముగా వున్నాయి. కాబట్టి నేను వాటికంటే ఇంకను పట్టుదలతో తీవ్ర పురుషార్థము చేయాలి. లేకున్న సద్గతి లభించదు. సత్య జీవితమును గడుపుట పురుషార్థికి చాలా అవసరము. ఈ ప్రపంచము అతి త్వరలో వినాశనము కాను న్నది. పరిస్థితులు భయంకరముగా ఎదురవుతున్నవి. నేను నా ప్రయ త్నంలో చక్కగా నిమగ్నమైనయెడల స్వస్థితితోనే పరిస్థితులన్నీ చక్క బడగలవు.

విశ్వ వినాశనము కొఱకు జరుగుతున్న విషయాలను, నేటి క్లిష్టపరిస్థితులను గాంచి ప్రతివారికి భగవంతుని స్మృతి మాటిమాటికీ కలుగుట సహజమే. హైడ్రోజన్ బాంబులు, అణుబాంబులు, క్షణంలో భస్మీభూతం చేసే మందుగుండు సామగ్రి వినాశనం చేయుటకు ఎదురుచూస్తున్నాయి. కరువు కాటకాలు, ఆర్థిక ఇబ్బం దులు విపరీత రూపాన్ని ధరించిన ఈ సమయంలో పరమాత్మని పావనస్మృతి చాలా ఉండవలెను. మాకు పరిస్థితులు, పరిసరాలు అనుకూలంగా లేవు. ఇలాంటి వనుకొనుట ఒక కుంటిసాకు మాత్రమే. వాతావరణము బాగాలేకున్న దానిని అనుకూలంగా మార్చుకొనవలెను. కాని మనము దిగజారిపోరాదు. ఒక అగరుబత్తి గది నంతటినీ సుగంధభరితం గావించగలిగినప్పుడు మీ పురుషార్థం, మీ యోగానుబంధం, లేక దివ్యగుణాల పరిమళం ఈనాడు కాకున్నా

రేపైనా తప్పక జగత్తంతా వ్యాపించగలదు. ఇంతటి నిశ్చయం ప్రతి ఈశ్వరీయ విద్యార్థికి ఉండవలెను.

## ప్రతి గంటకు 5-10 నిమిషములు ఈశ్వరీయ స్మృతి

ఎన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ అధిక సమయము ఈశ్వరీయ స్మృతియందుండ జాలకపోయిన యెడల కనీసం గంట కొక అయిదు లేక పది నిముషములైనను తప్పకుండా ఆత్మ స్వరూప స్వగుణాది చింతనలతో బాటు పరమపిత పరమాత్మ శివుని అత్యంత ప్రేమానురాగాలతో స్మరించవలెను. ఇంతమాత్రం ఎవరైనను చేయగలరు. డాక్టరు రోగికి హోమియోపతి మందిచ్చి ప్రతి రెండుగంటల కొకమారు వేసికొన వలెనంటే రోగి మరచిపోకుండా తన స్వస్థతకోరి అలాగే 2 గం॥ల కొకమారు వేసికొంటాడు. అదే విధంగా జన్మజన్మల వరకూ సదా ఆరోగ్యప్రదమైన సుఖ, శాంతి, ధన, ధాన్య సంపత్కరమగు అమర జీవితమును ప్రసాదించే ఈశ్వరుని ధ్యానము మరువరాదు. ఉదాహరణకు తమలపాకులు తినే అలవాటున్న వ్యక్తి ప్రతి 2 గం॥ల కొకమారు దానిని జ్ఞాపకంతో సేవిస్తున్నప్పుడు మన మెందుకు ఈశ్వరీయ స్మృతిని శుద్ధమైన అలవాటుగా చేసికొనరాదు? ఈ అలవాటుచే ఒక్క పైసా కూడా ఖర్చులేదు. పైగా ఎంతో దివ్యానందము చిరస్థాయిగా లభిస్తుంది.

అలాగే ప్రతిరోజు ఎన్నో పనులను మనం దృష్టి కేంద్రీకరించ వలసిన అగత్యం లేకుండానే యాంత్రికంగా, యధాలాపముగా చేసికొంటూ వెళ్ళిపోతుంటాము. కావున ప్రతి పని చేసికొంటూ కూడ మనం తలచుకొన్నట్లయితే పరమాత్ముని ప్రియస్మృతిలో నుండ గలము. పనులు పూర్తికాగలవు. స్మృతి అభ్యాసం కూడ పరిపక్వ మవుతుంది. కానీ ఈనాడు మానవుడు దీనిపై ధ్యాసనుంచక పనిచేసే సమయంలో వ్యర్థ సంకల్పములు చేస్తుంటారు. కార్యకలాపములు లేనపుడు మధ్య మధ్యలో మనకు లభించిన సమయంలో ఈశ్వరీయ స్మృతియందు సదుపయోగమొనర్చినచో దినమంతటికై మన యోగ చార్ట్ చక్కని ప్రభావితముకాగలదు. అందువలన పరమపిత

పరమాత్మ ఇపుడు మనల నుద్దేశించి "ఓ వత్సలారా! పరమపితనైన నన్ను మీరు స్మరించలేకపోయినచో కనీసము వ్యర్థచింతనలతో పనికిరాని ఆలోచనలతో అకళ్యాణము చేసికొనే సమయమునైనా నా స్మృతికి అంకితం గావించండి! ప్రతి దినము ఒక 8 గం॥లు ఉద్యోగ వ్యవహారములకు, ఇంకొక 8 గం॥లు నిద్ర, విశ్రాంతి-భోజన స్నానపానాదులకు వినియోగించినను మిగిలిన 8 గం॥లైనా సరే నా స్మృతిలో గడిపి ఆత్మోద్ధరణ గావించుకొనగలరు.

## సాయంకాలము నందు పురుషార్థము

ఉద్యోగ వ్యాపారాది వ్యవహారాదులు ముగిసిన తదుపరి సాయంత్రము ఇంటికి రాగానే కాళ్ళు చేతులు కడుగుకొని కొంత విశ్రాంతి లేక ఇంటిపనులు పూర్తిగావించి తాబేలు తన కర్మేంద్రియ ములను తనలోనే ఇముడ్చుకొన్నట్లు బాహ్య చింతనమాని ఒక ప్రశాంత స్థానములో కూర్చొని ఏకాంతముగా కానీ లేక కుటుంబ సభ్యులతో గానీ కూర్చొని చాలా ప్రేమతో పరమపిత పరమాత్మని స్మరించాలి. ఈ విధమైన అభ్యాసం చేయకపోయినచో మనసు కళ్ళెంలేని గుర్రంవలె భ్రమిస్తుంది. శరీర భ్రాంతికి అతీతముగా తన మనసును సర్దుకొనుచూ పరమపిత పరమాత్మని స్మృతియందు నిలిపే ప్రయత్నశీలికే యోగసిద్ధి ప్రాప్తించును.

సాయంకాలపు యోగమునకు కూడ విశేష ప్రభావము కలదు. దీనివలన మనసు ప్రశాంతముగా, నిర్మలముగా, వృత్తి సాత్వి కముగా కాగలదు. కావున సాయంకాలము స్మృతించే నియమమును ఏర్పాటు చేసికొనవలెను.

అతి తిండి, దుర్వ్యసనాలు, మత్తు పదార్థాలు సేవించుట మానుకొనవలసి యుంటుంది. కుటుంబ బాధ్యతలు కూడా నిర్వర్తించాలి. కానీ సమయమును అనవసర ప్రసంగములతో గడుప రాదు. ఒకవేళ మానసిక ఆహ్లాదము కావలసిన అశ్లీల వినోదముకానీ, చెడు సంస్కారములకు గానీ తావులేని దానిని పొందవచ్చును.

ఇవన్నీ ముగిసిన తరువాత రాత్రి జ్ఞానచింతన గావించి, పరమాత్మని స్మరించి సరిగా పది గంటలకు నిద్రించాలి. ఈ స్మృతి లోనే నిద్రించుటచేత చెడు సంస్కారముల తలంపులే లేని సాత్వి కమైన విశ్రాంతి లభిస్తుంది.

# ద్వితీయ యుక్తి

## దివ్య గుణధారణ

జీవితమును వజ్రతుల్యముగా చేసికొనుట యనగా దివ్య గుణములను ధారణ చేయాలని, రాక్షస ప్రవృత్తులకు స్వస్తిచెప్పాలని అర్థము. నేడు దుర్గుణముల వలననే మానవ జీవితము దుఃఖ మయమై గుడ్డిగవ్వకు కొఱగానిదై పోయినది. దివ్యగుణము లనభ్యసించనిదే ఎవరైనను నిర్విఘ్నముగా పరమాత్మునితోడి యోగము చేయజాలరు. అలౌకికమైన యోగ ఆనందము నను భవించలేరు. కావున ఈ జీవితములోనే సత్యశాంతిని పొందుటకు మరల భావి జీవితములో సదా సుఖ శాంతి సంపదలను సంప్రాప్తింప జేసికొనుటకు దివ్య గుణముల ధారణ తప్పకుండా చేయవలెను. కావున దీనికై పరిపూర్ణమైన శ్రద్ధ వహించాలి.

## పవిత్రత - జితేంద్రియత్వము

దివ్యగుణాలన్నిటిలో "పవిత్రత" చాలా ముఖ్యమైనది. పవిత్రుడే పరమాత్మ ప్రేమకు పాత్రుడు. కావున పరమాత్మపై పరిపూర్ణ ప్రేమ కలవారు తమ తనువు మనసు ధనముల పవిత్రతపై పూర్తి ధ్యాన ముంచవలెను. ధరించిన వస్త్రములు పరిశుభ్రముగా వుంచుకొనవలెను. మల విసర్జనానంతరము స్నానము చేయవలెను. ఆరోగ్యము సరిగా లేకున్న తడిబట్టతో శరీరమును శుభ్రపరచుకొని మంచి దుస్తులు ధరించవలెను. ఇక మానసిక స్వచ్ఛతకై పవిత్ర భోజనము చేయవలెను. మనసును వ్యర్థ సంకల్పములకు లోను

కానీయక బ్రహ్మచర్యమును పాటించవలెను. నిజానికి కమలపుష్ప సమానముగా జీవితమును సాధించుటయే పవిత్రత, తన్ను తానొక కర్మయోగి, ఈశ్వరీయ విద్య నభ్యసించే విద్యార్థిగా పరమపావను డగు పరమపిత పరమాత్మ సంతానముగా, శ్రీ లక్ష్మీనారాయణులు మొదలుగాగల దేవతా వంశజులుగా భావించుట చేతనే పవిత్రత జీవితంలో పాదుకొనగలదు. ఈ మార్గము తప్ప మరేదీ లేదు. మనసులో ఏ విధమైన ఆలోచనలు వచ్చినప్పటికీ కర్మేంద్రియ ములతో ఏ విధమైన పాపకర్మగానీ చేయరాదు. యోగికి తన కర్మేంద్రియములపై పూర్తి స్వాధీనపరచుకొనే శక్తి ఉండవలెను.

మనమిపుడు ఈశ్వరునితో మనసును సంలగ్నము చేయ దలచిన వారము కావున ఈ కనులద్వారా కామ, క్రోధ, లోభ, మోహాంకారపూరిత దృష్టితో ఎవరినీ చూడరాదు. నోటితో ఎలాంటి అపశబ్దములు గానీ, నిందించుట గానీ, విషయ వికారపుమాటలు గానీ ఉచ్చరించరాదు. ఏ వ్యక్తినీ దుఃఖ పెట్టరాదు. జ్ఞానము పొందిన తర్వాత పాపకర్మలు చేసిన యెడల 100 రెట్లు శిక్ష అనుభవించవలసి వస్తుందని గుర్తించవలెను.

## అంతర్ముఖిత్వము

ప్రతి దివ్యగుణమునకు దేని మహిమ దానికే వున్నది. వానిలో "అంతర్ముఖత్వ"మను దివ్యగుణమునకు అధిక మహిమ కలదు. మానవుడు అంతర్ముఖుడై అలౌకిక సుఖశాంతులనను భవించుట "ఆత్మ" పరిచయ మివ్వబడుతుంది. "అంతర్ముఖు" లగుట యనగా (దేహానికతీతంగా) భృకుటి మధ్య స్థానములో నివసించే ఆత్మయొక్క స్వరూపము, దాని పిత పరమాత్మను మననం చేసుకొనుట, చెవుల ద్వారా ఆత్మోన్నతి విషయములే వినుట, ముఖంద్వారా దాని చర్చలే చేయుట, కనులద్వారా ప్రతి వారిలో ఆత్మనే దర్శించుట. అంతర్ముఖులు కాజాలని వారి దృష్టి, మనోవృత్తి, కర్మేంద్రియాలన్నీ విషయ వాసనలపై పరుగులు తీస్తుంటాయి. వీరు వ్యక్తి-పదార్థముల పేరు ప్రతిష్ఠలకు బాహ్య సౌందర్యమునకు వెంటనే

లొంగిపోవుదురు. దీనితో జన్మ జన్మాంతరములుగా సంచితముగా వచ్చిన పాపకర్మలు తొలగకపోగా క్రొత్తగా పాపభారము పెరిగి పోతుంటుంది. కానీ పరమాత్మ జ్ఞాని మనసు ఆత్మ స్వస్వరూపములో ప్రభువు స్నేహస్మృతిలో సంలగ్నమైనందున పాంచభౌతిక పదార్ధములపై పరిభ్రమించదు. ఇలాంటి పరిపక్వులను మాయ ఎదిరించజాలదు. ఎవరైనా అతనిని మానావమానములకు గురిచేసే అపకార వార్తాలావము గావించినను, , లోభము, క్రోధము కలిగించ ప్రయత్నించినను అంతర్ముఖుడు ఉద్రేకమునకు లోనుగాక వాటిని వినీ విననట్లుంటాడు. అతడు ఒక పరమోత్కృష్టమైన ఆనందములో తేలియాడుచుండును. అంతర్ముఖునకు ఆత్మ స్వస్వరూప స్థితి అభ్యాసమగుటచే, దేహానికి అతీతముగా వుండుట అలవాటగుటచే అతనికి దుష్టుల దుష్టత్వముగానీ, అపకారిలో అపకార బుద్ధిగానీ కనిపించదు. అతనిని అశాంతి-దుఃఖములు తాకజాలవు. అతడు చెడువినడు-చెడు మాట్లాడడు. చెడు ఆలోచిం చడు. చెడు చేయకపోగా వాటిపైన ధ్యాసయే యుండదు. కావున అతని మనస్సు అనే హంస శాంతి సరోవరములో సదా శీతలత్వ ములనే ముత్యముల నేరుకొంటుంది. కావున మనము వజ్ర సమానమైన అమూల్య గుణమగు "అంతర్ముఖము"ను గ్రహించి జీవితమును వజ్ర సమానముగా గావించుకొందుము. దీనిచేతనే సహనశీలతాది గుణములు కూడ సంక్రమించి దివ్య జీవితారంభ మగును.

## సహనశీలత

జ్ఞాన మార్గమును స్వీకరించి జీవితమును కొనసాగించు చుండగా అనేక విపరీత పరిస్థితులు ఎదురవు చుండును. కొందరు ఎంతో కఠినముగా హింసించుతారు. మరి కొందరు నిందించుతారు. వాటిని ఎంతో ఓపికతో సహించుటలోనే మేలు వున్నది. ఇవన్నీ మనలో ఇంకా ఏ మూలైనా ఈర్ష్యా ద్వేషములు, క్రోధావేశములు ఉన్నాయేమో పరిశీలించుటకు వస్తాయి. చిన్నచిన్న ఆటంకములకే మనసు చలించి పరమాత్మని యందు సంలగ్నము చేయలేసంత

అపరిపక్వమైనది కాదనీ, ఇంత మాత్రమునకే లక్ష్యము నుండి దూరమయ్యే వారము కాదనీ పరీక్షించుటకు ఇవి చాలా ఉపకరించి మననం తీర్చి దిద్దుతాయి. కావున ఎన్ని వరిస్థితులనైనను భగవంతునిపై గల గాఢాను రాగముతో సహించవలెను. ఉదాహరణకు లౌకిక సంబంధ వ్యవహారములలో మానవుడు తన భార్యా పుత్ర-మిత్రాదుల కొఱకు ఎన్నో కష్ట పరిస్థితులను ఎదుర్కొనును. అలాంటప్పుడు మనకు ప్రాణప్రదుడైన పరమాత్మ మైత్రి కొఱకు జీవితమును అత్యుత్తమ జీవితంగా మలచుకొని భవిష్యత్తులో అతులితమైన ఆనందైశ్వర్యముల ననుభవించుట కొఱకు కొద్దో గొప్పో సహించలేమా! మన పవిత్ర మార్గములో ఎదురయ్యే సమస్త శారీరక, మానసిక, ఆర్థిక సంబంధమైన విఘ్నాలను సంతోషముగా సహిస్తూ "మన పూర్వకర్మల పాపఫలితమే మనల నీ విధముగా ఎదుర్కొంటున్నది. వీటి నొక్కమారు ఎదుర్కొని శాశ్వతముగా విముక్తి పొందుతాము అనుకొనవలెను. ఇతరుల అవగుణములను గాంచి మనము కోపావేశములకు లోను కారాదు. జీవితమును వజ్ర తుల్యము గావించుకొనవలెను. మేము గుణ గ్రాహకులము కావలెను. అవగుణాలనే కలుపు మొక్కలను దివ్య జీవనోద్యానము నుండి పెకలించి వేయాలనే లక్ష్యమును ఎదురుగా నుంచు కొనవలెను.

## సద్గుణ గ్రాహకత్వము

ప్రతివారిలో అవగుణాలతోబాటు కొన్ని సద్గుణములు కూడా తప్పకుండా వుంటాయి. నేనా గుణములనే స్వీకరించి ఆచరించెదను. నేను ఇతరుల అవగుణములను గ్రహించక సద్గుణ రత్నాలనే స్వీకరించుదును. ఎవరి జీవితము ఏ క్షణములో అంతమవుతుందో తెలియదు. కావున ఇతరుల దోష చింతన కావించి నాకు దుర్గతి కలిగించుకొనను. ఎవరి పాపాలకు ప్రతిఫలం వారే అనుభవించగలరు. నేనేల వారి పాప చింతన గావించి దోషిగా దుఃఖ

భాగస్వామిగా కావలెను? నేను సదా ఇతరులలో అవగుణములను చూడక ఆత్మికానందంతో ఉల్లాసంగా ఉంటాను. పాపాత్ములను కూడ మధుర స్వభావంతో మధుర దృష్టితో చూస్తూ శుభ చింతకుడనై వారు పాప విముక్తులగుటకు ప్రయత్నించుదును. కానీ నేను మాత్రము వారి దుర్గుణములకు బాధపడను. ఇతరుల అవగుణములు నాకు కనిపించినపుడు ఇవేవైనా నాలో ఏ మారుమూలనో దాగిలేవు కదా! అని పరిశీలించుకొని వానిని నామ రూపములు లేకుండా చేయుదును. ఇపుడు నేను పరమాత్మని గుణగ్రాహకుడను కానీ మానవుల అవగుణ గ్రాహకుడను కాను. అవగుణములను పెకిలించి వేయవలెనని సంకల్పించిన నేనేల ఇతరుల అవగుణములను చూడవలెను. ఇపుడు నేను ప్రభువుకు అంకితమై పోయాను. కావున అవగుణములను గ్రహించే పాపము చేయబోనని భావించాలి.

## అర్పణ మయత్వము

మన జీవితంలో విషయ వికారములను, రాక్షస ప్రవృత్తులను పెకిలించి వేయుటకు సరియైన ఉపాయమొక్కటే. అది పరమపిత పరమాత్మకు "అర్పణమయ భావన"తో నుండుట. ఇతఃపూర్వము మన మెవిధంగానైనను ఉండనీ, ఈక్షణం నుండి "నాదంటూ ఏదీ లేదు, నేను నా సర్వస్వము పరమపిత పరమాత్మ శివునకు సమర్పించుచున్నాను." ఇపుడు నా తనువు-మనసు-ధనము అన్నీ పరమాత్మునివే. నేనాయన జ్ఞానానువర్తినై ప్రవర్తించవలెనని నిశ్చయముచేసికొనవలెను.

తమ జీవితమును వజ్రతుల్యముగా చేసికొనదలచిన వారు గ్రుడ్డి గవ్వకు కొఱగాని తమ జీవితమును పరమాత్మకు సమర్పించి తమదంతయూ ఈశ్వరునిదేనని భావించుతూ, పవిత్రాచరణలో అనగా నిర్వికారులై ఈశ్వరీయ సేవలో నిమిత్తముగా కర్తవ్య నిర్వహణ గావించవలెను. ఈ విధమైన పద్ధతిచేత మనిషికి తన

తనువు-మనసు-ధనాదులపై మమత నశిస్తుంది. సంబంధీకులపై వ్యామోహం తొలగిపోవును. కావున ఇళ్ళు-వాకిళ్ళపై, సంబంధ బాంధవ్యాలపై, ధనధాన్యాలపై మోహం నశించుటకు అరణ్యము లకు వెళ్ళవలసిన అవసరంలేదు. వాటి నన్నింటినీ పరమాత్మ కర్పించి తాను నిమిత్తుడుగా (ట్రస్టీ) వ్యవహరించుటయే శ్రేష్టమైన యుక్తి. దీనిచే వారి జీవితము నుండి విషయ వికారములనే విషం తొలగి తద్ స్థానములో పవిత్రత లేక మధురత చోటు చేసికొనును.

## మధురత

ఈశ్వరీయ జ్ఞానముచేత జీవితము మధురాతి మధుర స్వభావముతో కూడియుండుట సహజ స్వాభావికము. ఈ జ్ఞానము అన్నిరకాలైన మాయయనే చేదు విషాలకు విరుగుడుగా పని చేయును. కాని ఈ మధురత అతనిలో నెలకొనుటకు ముందుగా ఈ సృష్టి నాటకమును సాక్షిగా చూస్తూ "ఈ నాటకమంతా పూర్వకల్పంలో ఇలాగే జరిగినది. మరల ఇపుడు జరుగుచున్నది. తదుపరి కల్పములో కూడ జరుగబోవు నదియైన పూర్వ నిర్ణీతమగు అద్భుతమైన నాటకము. ఇందులో ప్రతి వారు భిన్న సంస్కారముల కనుగుణ్యముగా పాత్రాభినయము గావించు చున్నారు" అని అనుకొనవలయును. ఈ రహస్యములను గ్రహించినవారు కటువుగా మాట్లాడరు: వారి మేలు కోరి జ్ఞానపు మధుర వాక్యాలు, దివ్య గుణాలతో కూడిన తీపి మాటలు, మరియు పరమాత్ముని మధుర చరిత్రలే వినిపించును. స్వయంగద్గదమవుతూ ఇతరులను కూడ ఆనందింపచేయుదురు.

వారు ములుకులవంటి మాటలనే రాళ్ళతో కొట్టక జ్ఞాన మధుర పుష్పాలతో ఒడి నింపుతారు. విషయ వికారములచేతనే మానవుని స్వభావం విషమువలె కఠోరంగా మారిపోయినది. అందువలననే ఇతరులను తన శత్రువులుగా, అపకారము తల పెట్టేవారుగా భావించును. కానీ నిజానికి ఆత్మకు తానుచేసే

చెడుపనులే తనకు శత్రువులనీ అవే ఇతరులద్వారా ప్రారబ్ధకర్మ రూపములో కష్టాల నిస్తున్నాయని గ్రహించి నపుడు ఎవరినీ తన శత్రువులుగా భావించుకొనక తన కర్మలలో శ్రేష్టత్వము నాపాదించుకొనే ప్రయత్నము చేస్తాడు. తనలో ప్రేమ-సద్భావనలనే సద్గుణాలను నెలకొల్పుకొని మాయ అనే శత్రువును జయించే పురుషార్ధములో ఉండును. అతను తన మధుర స్వభావంతో ఇతరులనాకర్షించి ఎల్లరి ధ్యాన ఈశ్వరునిపై మరలునట్లు ప్రయత్నించును.

## హర్షిత ముఖత్వము

జ్ఞానమును గ్రహించి నేను త్రిలోకనాధుడు, సర్వశక్తి వంతుడు, పతితపావనుడు, శాంతి ఆనంద పయోనిధి, స్వర్గ రాజ్య భాగ్య విధాతయగు పరమపిత శివపరమాత్మని సంతానమునని నిశ్చయించుకొనిన తరువాత మన ముఖముపై ఏనాటికీ శోకము, చింత మొదలైన చిహ్నములు కనిపించరాదు. సర్వసమర్ధుడు, పరమపిత, పరమశిక్షకుడు, పరమ సద్గురువునగు పరమాత్మ మమ్ములను శాంతి ధామమునకు మరియు వైకుంఠమునకు గొనిపోవుచున్నప్పుడు మన సంతోషానికి అవధులుండరాదు. మనమిపుడు పవిత్రులమై -యోగయుక్తులమై సర్వోత్కృష్టమైన సౌభాగ్యమును పొంద నుండగా చింతాశోకములు కలిగించే విషయ మేముండును? ఒకవేళ మన ముందు ఏదైనా దుర్ఘటనలు కానీ, హాని కలిగించే పరిస్థితులు కానీ ఎదురైనపుడు ఈ సంఘటనలన్నీ మనకు చివరి సారిగా నమస్కరించి వీడ్కోలు చెప్పుటకు వచ్చినవని జ్ఞానాధారంతో అనుకొనవలెను. ఈ పరిస్థితులు మనలను పూర్తిగా విడిచి పెట్టనున్నవి. వీటిని యోగబలముచే నాశనము చేయుపద్ధతి మాకు తెలిసిపోయినది. ఈ విధముగా మన పూర్వ కర్మల ఋణ భారము తీరిపోవుచున్నది. తలపై నున్న పాపఖాతా లేక ఋణం తీరిపోవుచున్నదని సదా సంతోషంగా ఉండవలెను. ఇపుడు మనకు

కేవలం ఒకే చింత మనలను మనమే గాక ఇతరులను కూడ ఏ విధంగా పవిత్రులుగా యోగయుక్తులుగా తయారు చేయాలని ఉంటుంది. ఈ శుభచింతన మదిలో నెలకొనిన వారికి మరొకదాని గురించి చింతించేందుకు సమయ మెక్కడ ఉన్నది? జ్ఞాన చింతన గావించు వారి బుద్ధిలో రెండవ చింత ప్రవేశించుటకు అవకాశమే లేదు. అతడు ఈశ్వరుని ఒకే బలంపై ఒకే నిశ్చయంపై నిలదొక్కుకొని నిశ్చింతగా, నిర్భయంతో పురుషార్థంలో తత్పరుడై యుండుటమే గాక అతీంద్రియ సుఖమును అనుభవించును.

## నిర్భయత్వము

పరమపిత పరమాత్మని సహాయమును హృదయ పూర్వకముగా పొందినవానికి, తన తనువు, మనసు, ధనము సర్వస్వము అతనికే అప్పగించిన వానికి ఇతరుల భయముంటుందా? సదా ఇతరుల శుభము కోరుతూ ఈశ్వరుని సేవలో సంలగ్నమై యుండే వానికి భయమెక్కడిది? తనను తాను ఆత్మగా భావించక దేహ మనుకొనేవారినే, ప్రాపంచిక వస్తు వ్యక్తులపై మమకారమున్న వారినే భయము పీడిస్తుంది. కానీ పరమశక్తి సంపన్నుడైన పరమాత్మని శరణు పొందిన వ్యక్తి అచంచల మనస్కుడై నిర్భయంగా సంచరిస్తూ మధురాతి మధురమైన గుహ్యాజ్ఞాన రహస్యములనీవిధముగా మననము చేయును. జరగవలసినదేదో జరిగే తీరుతుంది. ఆ జరిగేది కూడ నా పూర్వజన్మల కర్మ ఫలితమే. అనుభవించేది కూడా అదే కావున ఇపుడు ఏ విషయానికి ఎలాంటి పరిణామమునకు గాని భయభీతులు కాకుండా నా కర్తవ్యమును సక్రమముగా నిర్వహించెదను. ఇక మిగిలిన దాని కొరకు సర్వరక్షకుడైన పరమపిత పరమాత్మ సహాయముపైననే ఆధారపడుతూ సాక్షిద్రష్టనై కర్తవ్యము పూర్తి చేసికొంటూ సాగిపోయెదను.

## సాక్షి

సాక్షి మాత్రుడై జీవితమును కొనసాగించే వ్యక్తి జీవితమే

మధురాతి మధురముగా, లోకాతీతముగా ఉంటుంది. సాక్షి స్థితి యందున్నప్పుడే మానవుని వివేకము వికసించి సరియైన నిర్ణయము స్ఫురిస్తుంది. సాక్షి మాత్రునకు సుఖదుఃఖాలు కానీ, ఘనావమాన ములు కానీ అంటవు. వాటి నీడ కూడ అతనిపై పడదు. సాక్షి మాత్రునకు జీవితంలో కలిగే ఆనందము ఏ కోటీశ్వరుడు కూడ పొందలేడు.

కానీ మానవునిలో సాక్షి స్థితి ఈ విశాల విశ్వమొక విరాట్ నాటకమని, ఇది మెల్లమెల్లగా సాగుతున్నదని, ఇందులో భిన్న భిన్న ములైన నామరూపాదులతో కూడిన పాత్రధారులు క్రమబద్ధముగా తయారైన ఒక ప్రణాళికానుసారము పాత్రాభి నయము గావించు చున్నారని దానినే నేను చూచుచున్నానని అనుకొన్నపుడే కలుగు తుంది. అతడు తన జీవితంలో రాబోయే సంఘటనలు కూడ నాటకములో జరగబోయే సంఘటనలుగా తన్ను ఆత్మ సాక్షిగా భావించినపుడే సదా ఆనందము లేక నారాయణుని కాగలననే నిషాలో (తన్మయత్వం) ఉండగలడు. సాక్షి స్థితియందు మానవుడు తన మనసులో ప్రతి వృత్తాంతమును గురించి ఈ పాత్రను నేను అసంఖ్యాకంగా చూచాను, చేసాను. ఇపుడు మరల భావి నిర్మాణము జరుగుచున్నది. ఎవరే విధముగా పురుషార్థము గావించిన అలాగే వారి ప్రారబ్దమనే ఫిల్మ్ తయారగుచున్నది. ఆదే దృశ్యము ముందు ముందు మరల మన ఎదురుగా రాగలదు. ఇలా అనుకొనుచు తన పాత్రను, ఇతరుల పాత్రను కూడ అతీతుడై చూచుచుండును. మిత్ర సంబంధీకులతో వ్యవహరిస్తూ కూడ అతని మనసులో వీరంతా ఈ గొప్ప నాటకములో నాతోటి పాత్రధారులు. వీరు కూడ ఆత్మలే. కానీ ఈ శరీరమనే వేషధారణ చేసి కొంతకాలము వరకు వీరు నాతో కూడ పాత్రాభినయము గావించుచున్నారు. నాతోటి వీరి పాత్ర సమాప్తము కాగానే పరస్పరము విడిపోవుదము ఇపుడతి త్వరలో ఆ రోజు రానున్నది. హైడ్రోజన్ బాంబులు, ఆటంబాంబులు మొదలైన మారు

ణాయుధాలతో ఈ జగన్నాటకము ముగియగా మన మందరము పరంధామమునకు తిరిగి వెళ్ళవలసి యున్నది అనిపించును. అతనికి తనకదే చివరిపాత్రయని త్వరలో ఆట సమాప్తము కానున్నదని అనుభూతి కలుగుతుంది. ఈ ఆలోచనలతో అతని బుద్ధి ప్రాపంచిక పదార్థములనుండి అతీతమై పోతుంది. అతని పాదము భూమిపై నిలువదు. తన జీవననౌక ఈ ప్రపంచమనే ఓడరేవు నుండి బయలు దేరి లంగరు ఎత్తి మరోతీరానికి పయనమైనట్లు తోస్తుంది. నమ్ర చిత్తుడై తన జీవితమును శ్రేష్టముగా మలచుకొనుటలోనే మునిగి ఉంటాడు.

## నమ్రత

జ్ఞానీ ఆత్మ తనలోని లోపములను పోగొట్టుకొంటూ, దివ్య గుణాల నభ్యసిస్తూ పరమపిత పరమాత్మనే నిరంతరము స్మరించే దీక్షతో నుండును. తానింకా సంపూర్ణుడు కాలేదని గ్రహించి ఇతరు లతో చాలా నమ్రతగా వ్యవహరిస్తాడు. ఇతరుల లోపాలు కనిపించి నప్పటికీ వీళ్ళు కూడ తమ సంస్కారములకు వశీభూతులై వున్నారని, దివ్య పరివర్తన కలుగుటకు ఇంకను సమయము పట్టునని అతనికి తెలియును. తాను గుణవంతుడనని గర్వపడడు. ఇతరులను హీనముగా చూడడు. అవ హేళన చేయడు. అసహ్యించుకొనడు. పైగా వారిని చెడు అలవాటుల నుండి తొలగించి పురోగమించే శుభ భావనతో ప్రేమగా వ్యవహరించును. తన లోపము లెవరైనా ఎత్తి చూపిన కోపగించక నా ఉన్నతికి మీరీ విధముగా తోడ్పడినారని తలంచి వారిని తన మేలుకోరే మిత్రులుగా శుభచింతకులుగా భావించును.

తనను అవమానపరచినను, తన మాటను వినకుండా నిర్ల క్ష్యము చేసినను జ్ఞాని వ్యథ చెందడు. ఎవరు చేసిన దుష్కర్మల ఫలి తము వారే అనుభవించెదరని అతనికి తెలియును. కావున తన మన సులో అహంకారము, తిరస్కార భావము, కపటము, ఏహ్యాభావము రానీయక సరళముగా వ్యవహరించును.

## సరళత

మానవుని మనోస్వచ్ఛత, సత్యశీలము, సరళ స్వభావముల పైననే సత్యచక్రవర్తి, సత్యశివ సుందరుడగు పరమాత్ముని అనుగ్రహము ఆధారపడి యుండును. అతనికి తన సత్యసంధతలోనే పరమాత్ముని యదార్థానుభూతి కలుగును. నిష్కల్మషమైన నిర్మలమైన సరళ స్వభావము అన్యాత్మలనేగాక పరమాత్ముని కూడ తమవైపు సమాకర్షించ గలదు. కావున సరళతయే జ్ఞాని కుండవలసిన విశిష్ట గుణము. ఇది లేకున్న జీవితములో జ్ఞానధారణ గావించలేరు. నిజమైన ఆత్మిక సుఖానుభూతి కూడ పొందజాలరు.

## దృఢత్వము, ఆత్మ విశ్వాసము పురుషార్థములో తీవ్రత

ఇపుడు నేను పురుషార్థము చేయుచున్నాను. కావున పొరపాట్లు వస్తుంటాయి అనుకొనే పొరపాటు ఏ పురుషార్థి చేయరాదు. పురుషార్థియనగా వికారములను జయించేవాడు. కర్మేంద్రియములను స్వాధీనపరచుకొనేవాడు. యోగయుక్తుడై యుండుట తన విద్యుక్త ధర్మంగా భావించేవాడు. ఒకవేళ మనవలన ఏవైనా పొరపాట్లు జరిగినా ఇకముందు అటువంటి పొరపాట్లు రానీయననే దృఢ సంకల్పముతో నిశ్చయించుకొనాలి. కేవలము దృఢ సంకల్పము చేయుట మాత్రమేకాదు. ఆత్మ విశ్వాసముతో తీవ్ర పురుషార్థము చేసి మాట నిలుపుకొనవలెను.

పైన ఉదహరించిన కొన్ని దివ్య గుణములను దైనందిన జీవితములో విధిపూర్వకముగా ఆచరించి జీవితమును వజ్రతుల్యముగా చేసికొనవలెను. ఇవియేగాక మృదుత్వము, గాంభీర్యము, సంతోషము, దయ, ధైర్యము, నిర్మల ప్రేమ, శుభభావన మొదలగు సద్గుణములను కూడ జీవితములో అలవరచుకొనవలెను. దీక్షతో నిశ్చయబుద్ధి కలిగి ఆచరించిన యెడల ఈ పురుషార్థము చాలా సులభమగును.

# తృతీయ యుక్తి

## నియమపాలన

మన జీవితము వజ్రసమానంగా చేసికొనదలచినను, శ్రేష్ఠ కర్మల నాచరించదలచినను, యోగానంద మనుభవించవలె నన్నను ముక్తి, జీవన్ముక్తి పొందవలెననుకొన్నను ప్రజాపిత బ్రహ్మ ద్వారా పరమాత్మ ప్రబోధించే నియమములను తప్పకుండా మనమిపుడు పాటించవలెపను. ఈ నియమపాలన లేకుండా మనము జ్ఞానయోగ ములలో ముందడుగు వేయజాలము. నిజమైన శాంతి-ఆధ్యాత్మిక శక్తి సాధించలేము.

## బ్రహ్మచర్య పాలన

పాటించవలసిన నియమములలో మొట్టమొదటిది "బ్రహ్మ చర్యము". దీనిని అనుష్ఠించలేనివారు ఈశ్వరీయ స్మృతిలో స్థిరముగా నుండజాలరు. క్రోధాది వికారములనుపశమింపజేయజాలరు. బ్రహ్మ చర్య పాలనచేతనే మానవుని బుద్ధి స్వచ్ఛమగును. విషయ వికారము లను జయించగల శక్తి కూడ కలుగును. కావున "కామ" వాసనను మహాశత్రువుగా, బ్రహ్మచర్యమును మనకు పరమ మిత్రునిగా తలచి మనసా వాచా కర్మణా దీనిని వైదొలగించి సంపూర్ణ బ్రహ్మచర్య వ్రత పాలన గావించవలెను. ఈ పాపిష్టి కామవికారమే మానవుని పవిత్ర స్థితినుండి పతనముగావించి దేవతా పదవినుండి నరకమునకు త్రోసివేసినదని మరువరాదు. ఈ కామమే మన స్వాస్థ్యము (Health) ను, ఆయువును నష్టపరచినది. ఇదే మనిషిని పీల్చి పిప్పిచేసి దేనికి చేతగాని వానిగా చేసినది. కావున కామము మానవునకు ప్రబల శత్రువని గ్రహించవలెను.

ఇపుడు సర్వమంగళ ప్రదాతయైన పరమపిత శివపరమాత్మ మనల నుద్దేశించి :

"ప్రియమైన పిల్లలారా! జన్మ జన్మలనుండి మీ లౌకిక తల్లి దండ్రుల ననుసరించి విషయ వికారములకు గురియగుతూ వచ్చారు. ఇందువలననే సత్యయుగ సుఖ జీవితమును, దైవీ రాజ్య భాగ్యమును కోల్పోయి చాలా దుఃఖాలపాలయ్యారు. కావున ఇపుడైనా ఈ ఒక్క జన్మనందైనా పరమపితనగు నానుండి పవిత్రతయనే వారసత్వమును పొందండి". ప్రియ వత్సలారా! మీరు జన్మ జన్మాంతరాలుగా నన్ను ఓ పతిత పావనా! పరాత్పరా మమ్ములను ఈ విషయాదుల నుండి విముక్తులను గావించమని ప్రార్థించారు. కానీ ఆశ్చర్యము? మీరు కోరిన విధముగా విషయ వికారముల నుండి విడిపించుటకు పరంధామమునుండి వచ్చినప్పటికీ మీరు వాటిని వదిలి పెట్టలేకున్నారు. ఈ ఘోరమైన విషయాదులను విడిచి పెట్టుడని బోధించే నన్నే మీరు గట్టిగా పట్టుకొని కూర్చున్నారు. ఈ కామమనే మొసలిపై కూర్చుని భవసాగరతీరము చేరాలనే ఆశతోనున్నారా? ఇది అసాధ్యము సుమా!" అని ప్రబోధించుచున్నాడు.

**ఇది చాలా క్లిష్టమైన అత్యయిక పరిస్థితి**
**కావున పవిత్రులు కండు!**

## కళ్యాణకారి పరమపిత శివపరమాత్మ

"హేవత్సలారా! ఈ సమయము అనేక ఆపదలతో కూడిన సంకట పరిస్థితి (Emergency). త్వరలోనే ఈ కలియుగము మహావినాశనము కానున్నది. ఇపుడీ చివరి జీవితములో కొద్ది సమయము మాత్రమే శేషముగా మిగిలియున్నది. ఇపుడు నా ఆజ్ఞ (ORDINANCE) పవిత్రులు కండు! బ్రహ్మచర్య వ్రతపాలన చేయుడు!" అనునదియే. కామమనే మహాశత్రువును దరిచేరనీ

యకండి. ఇపుడు నేనిచటనే శ్రీలక్ష్మి శ్రీమన్నారాయణులు రాజ్యము చేసే కృతయుగము (సత్యయుగము) స్థాపించుచున్నాను. పతిత మయమై వేశ్యాలయముగా మారిన భారతదేశమును పవిత్రమైన శివాలయమువలె తయారు చేయుచున్నాను. ఓ వత్సా! ఈ సృష్టి మహావినాశనములో విషయవికారములు తప్పకుండా వదలి పోవలసియే యున్నవి. కానీ ముందే మీరు స్వేచ్ఛతో యోగాశక్తులై బ్రహ్మచర్య పాలన గావించినచో రాబోయే దేవతా సామ్రాజ్య భాగ్యమును పొందగలరు.

ఓ నా ప్రియమైన సంతానమా! ఈ సంకట స్థితిలో కొన్నాళ్ళ వరకు ఈ మహావికారమైన కామమును వదిలి పెట్టలేరా? మీరు నా కొఱకు ఈ మాత్రం త్యాగం కూడా చెయ్యలేరా? కొద్ది రోజులవరకైనను ఈ చెడు అసభ్యమైన అలవాటును వదలి పెట్టాలని తోచుట లేదా. పరమాత్మునిపై మీకున్న ప్రీతి ఇదియేనా.

ప్రియ పుత్రులారా! ఇపుడు మీరు గడుపుచున్న జీవితము గృహస్థాశ్రమ మనిపించుకొనదు. ఆశ్రమమనగా పవిత్ర స్థానమునకు పేరు. కానీ ఈ కలియుగములో ప్రతిగృహము కామమనే కత్తితో పరస్పరం హింసించుకొనే కసాయి గృహముగా మారినది. ఇంటింటా భ్రష్టాచారం వ్యాపించినది. నిజముగా గృహస్థాశ్రమము అను శబ్దము శ్రీలక్ష్మి శ్రీనారాయణులకే వర్తించగలదు. అచట కామ వికారమను మాట మచ్చుకైనను లేక యోగ బలముద్వారా సంతానం కలుగుతుంది. అందువలన మీ పూర్వీకులవలె మీరు కూడ పవిత్రులు కావాలి. పరమాత్ముని ప్రియ సంతానమై యుండి కామపిశాచములవలె ప్రవర్తించ వచ్చునా? ఇపుడు కామమనే విషమును త్రాగుట, త్రాగించుట మాని జ్ఞానామృత పానము చేయండి.

# సాత్వికాహారము - పవిత్రత

భోజనము యొక్క ప్రభావము మనసుపై పడును. తామసికాహారము భుజించుటచేత మనిషి త్వరగా ఉద్రేకమునకు లోనగును. అతని చిత్తవృత్తి అపవిత్రముగా మారిపోవుటయేగాక నిద్ర-సోమరితనం ఆవరించును. ఇదే విధముగా రజోగుణ ప్రధానమైన ఆహారము చేత కూడ మానసిక చాంచల్యము, దృష్టి, వృత్తి వ్యవహారాదులలో కూడ అపవిత్రత చోటు చేసికొనును. చిన్న మాటకు కూడ సహించజాలక ఉద్రేకముతో కోపమునకు గురియగుదురు. క్రమముగా ఉచితానుచిత జ్ఞానము నశించి ధర్మాధర్మముల భేదమును సరిగా గ్రహించలేరు. సాత్వికాహారము స్వీకరించనంత వరకు కామక్రోధాది వికారములపై పూర్తి విజయమును సాధించలేరు సరిగదా యోగము నందు కూడ మససును సంలగ్నము చేయలేరు.

కావున మనము ఈశ్వరీయ స్మృతిలోని అమితానందమును పొందవలెనన్న, భోగి జీవితము నుండి యోగిగా మారాలనుకొన్నను, కర్మేంద్రియములపై విజయము ప్రాప్తింప చేసికొనవలె ననుకొన్నను ఆహారము పట్ల విశేష శ్రద్ధ కావలెను. మనము తినే ఆహారము పవిత్ర సంపాదనకు సంబంధించినదై యుండవలెను. కాబోయే దేవతలమైన మనము దేవతలకు నైవేద్యము చేయునటువంటి సాత్వికాహారమునే స్వీకరించవలెను.

విశేషించి గుర్తుంచుకొనవలసిన విషయ మేమనగా కామక్రోధాదులకు లోనైనవారు వండిన ఆహారమును మాత్రం మనము భుజింపరాదు. అన్నము యొక్క ప్రభావము మనస్సుపై పడినట్లు మనసుయొక్క ప్రభావము అన్నముపై పడుతుంది. వికారి మానవుడు వండిన దూషిత భోజనము యోగాభ్యాసికి పనికిరాదు. అది మనసుపై చెడు ప్రభావమును పడవేయును. కావున బ్రహ్మచర్యమును పాటిస్తూ పరమపిత పరమాత్మని స్మృతియందుంటూ వండిన

వారి చేతి ఆహారమును స్వీకరించినచో మన ఆధ్యాత్మిక పురుషార్థమునకు దోహదము కలుగజేయును. ఇంతేగాకుండా భోజనము చేయునపుడు కూడ పరమపిత పరమాత్ముని స్నేహ స్మృతి యందుంటూ భుజించినచో ఆహారముపై ఆసక్తి ఉండదు. పవిత్రము కూడ కాగలదు.

## జ్ఞాని మరియు యోగయుక్తుల సాంగత్యము

సాంగత్య ప్రభావమనే రంగు ప్రతి మనిషిపై త్వరగానో లేక మెల్లమెల్లగానో తప్పక పడుతుంది. కావున మనము వికారీ మానవుల సాంగత్యము చేయకుండా ఈశ్వరీయ ప్రేమికులు, యోగాభ్యాసులు, నిశ్చయ బుద్ధులునగు వారి సాంగత్యమునే చేయవలెను. అపుడే మనకు కూడ యోగాభ్యాసము నందు "మనో సంలగ్నత" దినదిన ప్రవర్ధమాన మగును. ఒకవేళ కార్యార్థము విషయ వికారుల సమీపములో వుండవలసి వచ్చినను మన మనసును మాత్రం సత్యస్వరూపుడైన పరమపిత పరమాత్ముని సాంగత్య స్మృతిలోనే యుంచుతూ జ్ఞానము వ్యాపించేటట్లుగా ప్రయత్నించి వారిని ప్రభావితులుగా చేయవలెను.

చెడు అశ్లీల గ్రంథ పఠనము మానివేయాలి. మనసును చెడుగా చేసే సినిమాలు, చెడు సహవాసములు మొదలైన దుర్వ్యసనములను వదలి పెట్టవలెను. వీటి సాంగత్య దోషము చేత మనిషి అనేక చెడు విషయాలను నేర్చుకొనును. తదుపరి వాటిని జీవితమునుండి పారద్రోలుట చాలా కష్టమవుతుంది. ఇంతియేగాక దేవీ దేవతలకు కూడ విషయ వికారములు కలవని కళంకము నాపాదిస్తూ నిందించిన గ్రంథములు అసత్య జనితములు. కావున అవి ధర్మ గ్రంథాల రూపములో వున్నప్పటికీ అసత్యమైన అశ్లీల గ్రంథాలుగా భావించి వాటిని చదువుట మానివేయవలెను.

-: ఓం శాంతి :-

